ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888

పేజీలు : 4 సంపుటి : 01 - సంచిక 164 ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణ సోమవారం 16- 9 - 2024 వెల - 2 Digital Edition

## ఇంజనీర్లకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు



**అమరావతి:** జాతి నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర కీలకమని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా జాతీయ ఇంజనీర్స్ డేగా ఇవాళ జరుపుకుంటున్న నేపథ్యంలో ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. దేశ అభివృద్ధికి సూచికలైన ఇంజనీర్లకు హృదయపూర్వక శుభాకాంక్షలు అని ఆయన పేర్కొన్నారు. ఈ సంవత్సరం ఇంజనీర్స్ డే సందర్భంగా 'సుస్థిరమైన భవిష్యత్తు కోసం ఆవిష్కరణ' అనే నినాదంతో ఇంజనీర్లు తదుపరి లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగడం అభినందనీయమని వ్యాఖ్యానించారు. అభివృద్ధి చెందుతున్న దశ నుంచి అభివృద్ధి సాధించిన దేశంగా భారతదేశం వేగంగా ప్రయాణిస్తున్న వేళ ఇంజనీర్ల సేవలు అమూల్యమైనవని ప్రశంసించారు. క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే ప్రతి సవాలును మన ఇంజనీర్లు సమర్థవంతంగా ఎదుర్కొని దేశాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్తారని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నట్టు పవన్ కల్యాణ్ అభిలాషించారు.

-మిగతా 2లో

## ఆన్‌లైన్‌లో లాటరీ ద్వారా మద్యం షాపుల లైసెన్సులు జారీ?

## ఏపీలో 19న కొత్త లిక్కర్ పాలసీ నోటిఫికేషన్?



ఏపీలో ఈ నెల 19న కొత్త మద్యం పాలసీ నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉంది. ఈ నెల 18న జరిగే క్యాబినెట్ భేటీలో కొత్త మద్యం పాలసీపై చర్చించనున్నారు. అనంతరం నూతన మద్యం పాలసీపై నోటిఫికేషన్ విడుదల చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ కొత్త లిక్కర్ పాలసీని అక్టోబర్ 1 నుంచి అమలు చేయాలని చంద్రబాబు సర్కార్ భావిస్తున్నట్లు సమాచారం.

కొత్త లిక్కర్ పాలసీకి సంబంధించి ఆన్ లైన్ లో లాటరీ ద్వారా షాపుల లైసెన్సులు జారీ చేయనుంది ప్రభుత్వం. వైసీపీ హయాంలో మద్యం షాపులు ప్రభుత్వం ఆధ్వర్యంలో నడవగా ఇప్పుడు ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే అవకాశం ఉంది. అటు ఇప్పటికే తక్కువ ధరకే నాణ్యమైన మద్యం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొత్త మద్యం విధానాన్ని ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. దీనికి సంబంధించిన కసరత్తు పూర్తైంది. కొత్త లిక్కర్ పాలసీకి సంబంధించిన విధివిధానాలు కూడా ఖరారైనట్లు తెలుస్తోంది.

-మిగతా 2లో

## అమరావతి రాజధానిలో మంత్రి నారాయణ పర్యటన..



ఆంధ్రప్రదేశ్ మంత్రి నారాయణ ఆదివారం అమరావతిలో పర్యటించారు. ఎర్రబాలెంలో భూములు ఇచ్చిన రైతుల ఇళ్ల వద్దకు నారాయణ వెళ్లారు. ల్యాండ్ పూలింగ్ ద్వారా రాజధానికి ఎర్రబాలెం రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చిన విషయం తెలిసిందే.

ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. గతంలో అమరావతి రాజధానికి భూములు ఇవ్వని రైతులు ఇప్పుడు స్వచ్ఛందంగా ఇచ్చేందుకు సన్నద్ధమయ్యారని చెప్పారు. భూములు ఇచ్చే రైతుల ఇంటికి నేరుగా తానే వస్తానని చెప్పానని అన్నారు. అప్పట్లో భూములు ఇచ్చిన రైతులకు లాటరీ పద్ధతిలో ఫ్లాట్స్ ఇచ్చామని, ఇప్పుడు కొంత మేర భూములు మాత్రమే అవసరమని తెలిపారు.

ఇప్పుడు భూములు ఇచ్చే రైతులకు బహిరంగ ఆఫర్ ఇస్తున్నామని, వారికి కావాల్సిన చోట, ఎక్కడ భూమి ఉందో అక్కడ వారు కోరుకున్న చోట ఫ్లాట్స్ ఇవ్వనున్నామని తెలిపారు. అలాగే, రైతులకు అందాల్సిన రెండు వార్షిక కౌలును అందిస్తామని చెప్పారు. ముందుగా ఒక కౌలును త్వరలోనే అందిస్తామని అన్నారు. గత వైసీపీ సర్కారు రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులను అపహాస్యం చేసిందని చెప్పారు.



## అమరావతి నిర్మాణాలకు నిపుణుల కమిటీ గ్రీన్ సిగ్నల్

**అమరావతి :** అమరావతి నిర్మాణాల కొనసాగింపునకు ఐఐటీ చెన్నై, హైదరాబాద్ నిపుణుల బృందం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గతంలో చేపట్టిన నిర్మాణాలు పటిష్టంగానే ఉన్నాయని, వాటి పునాదులకు డోకా లేదని తేల్చాయి. ఐదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన హైకోర్టు, సచివాలయం విభాగాధిపతుల కార్యాలయ భవనాల పునాదులను నిపుణులు పరిశీలించారు. వాటిపై అధ్యయనం చేసిన ఆ రెండు టీమ్ లు ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి అందజేశాయి. ఒకట్రెండు రోజుల్లో ప్రభుత్వానికి తుది నివేదిక కూడా ఇవ్వనున్నాయి.

అమరావతిలో టీడీపీ హయాంలో చేపట్టిన సచివాలయం విభాగాధిపతుల కార్యాలయ భవనాల టవర్ల నిర్మాణాలను కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, ఐదేళ్లుగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. ఎండకు ఎండాయి, వానకు తడిచాయి. కొంతకాలంగా నీటిలోనే నానుతూ ఉన్నాయి. వాటి పటిష్టతను పర్యవేక్షించే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం చెన్నై ఐఐటీ బృందానికి అప్పగించింది. ఆ పునాదులను పరిశీలించేందుకు చెన్నై ఐఐటీ నిపుణులు బోటులో వెళ్లాల్సి వచ్చింది. పునాదుల నుంచి కొంత భాగాన్ని కత్తిరించి తీసుకెళ్లి వాటి పటుత్వాన్ని పరిశీలించారు.

-మిగతా 2లో

## రాహుల్‌పై కేంద్ర మంత్రి టెర్రరిస్టు వ్యాఖ్యలు... కాంగ్రెస్ ఫైర్



**న్యూఢిల్లీ:** లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పై కేంద్ర మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాహుల్‌ను 'నెంబర్ వన్ టెర్రరిస్ట్'గా పేర్కొన్నారు. సిక్కు వర్గాలను ఉద్దేశించి అమెరికా పర్యటనలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై మంత్రి స్పందిస్తూ, రాహుల్ గాంధీ అసలు భారతీయుడే కాదని అన్నారు. రాహుల్ గాంధీ ఇండియన్ కాదు. ఆయన ఎక్కువ సమయం బయటే గడిపారు. ఆయనకు ఈ దేశంపై ఏమాత్రం ప్రేమ లేదు. అందువల్లే విదేశాలకు వెళ్లినప్పుడల్లా భారతదేశాన్ని వక్రీకరించి మాట్లాడుతుంటారు.

-మిగతా 2లో

## రేవంత్‌రెడ్డి ఇంటి సమీపంలో కలకలం రేపిన బ్యాగ్



**హైదరాబాద్** జూబ్లీహిల్స్‌లోని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటి సమీపంలో ఓ బ్యాగ్ కలకలం రేపింది. రేవంత్ రెడ్డి ఇంటి సమీపంలో అనుమానాస్పదంగా బ్యాగ్ కనపడడంతో దాన్ని ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ విభాగ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు.

రేవంత్ రెడ్డి ఇంటికి సమీపం నుంచి బ్యాగును మరో ప్రాంతానికి తరలించి తనిఖీలు చేశారు. ప్రస్తుతం రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఉన్నారు. ఇవాళ టీపీసీసీ అధ్యక్షుడిగా మహేశ్ కుమార్ గౌడ్ బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. మహేశ్ కుమార్ గౌడ్‌కు రేవంత్ రెడ్డి పీసీసీ బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ, ఏఐసీసీ సెక్రటరీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు హాజరయ్యారు. ఇదే సమయంలో రేవంత్ రెడ్డి ఇంటికి సమీపంలో బ్యాగు కనపడడం గమనార్హం.

## విపక్షాలపై ప్రధాని మోదీ విసుర్లు



**రాంచీ, సెప్టెంబర్ 15:** రాష్ట్రంలో ఖనిజాలు, మైనింగ్, సైన్యం భూములు దొచుకున్న అధికార జార?ండ్ ముక్తి మోర్చ పార్టీని ఇంటికి సాగనంపే సమయం ఆసన్నమైందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆదివారం జంషెడ్‌పూర్‌లో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికార జేఎం ఎంతో పాటు ఇండియా కూటమిలోని భాగ స్వామ్య పక్షాలైన కాంగ్రెస్, ఆర్జే డీపై ఈ సందర్భంగా ప్రధాని మోదీ నిప్పులు చెరిగారు. తమ ను లక్ష్యంగా చేసుకుని అవినీతి కేసులు పెడుతుందంటూ బీజేపీ పై అధికార జేఏంఏం నేతలు చేస్తున్న ఆరోపణలను ప్రధాని మోదీ ఎండగట్టారు.

జార?ండ్‌లోని జేఎంఎం ప్రభుత్వం.. కాంగ్రెస్ స్కూల్ ఆఫ్ కరప్షన్‌లో శిక్షణ పొందిందని

-మిగతా 2లో

## సీఎం రాజీనామాకు 48



**న్యూఢిల్లీ:** మరో రెండు రోజుల్లో ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయనున్నట్టు ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రకటన రాజకీయ వర్గాల్లో సంచలనమైంది. 48 గంటల గడువు వెనుక సీఎం ఉద్దేశం ఏమై ఉండవచ్చనే చర్చ కూడా బలంగా జరుగుతోంది. ఎటకేలకు 'ఆప్' మంత్రి అతిషి సింగ్ ఆ కారణాన్ని వెల్లడించారు. ఈరోజు ఆదివారం కావడం, రేపు ఈద్-ఇ-మిలాద్ కారణంగా సెలవు ఉండటంతో మంగళవారమే వర్కింగ్ డే అవుతుందని అన్నారు. ఆ కారణంగానే రెండు రోజులు సమయం తీసుకున్నారని అతిషి తెలిపారు. దాదాపు ఆరు నెలల తర్వాత బెయిలుపై బయటకు వచ్చిన కేజ్రీవాల్ ఆదివారంనాడు జరిపిన పార్టీ సమావేశంలో తన రాజీనామాపై కీలక ప్రకటన చేశారు. రెండు రోజుల తర్వాత సీఎం పదవికి తాను రాజీనామా చేస్తున్నానని, మళ్లీ ప్రజలు తీర్పు ఇచ్చేవరకూ ఆ కుర్చీలో కూర్చోనని చెప్పారు.

2లో

## గంగమ్మ ఒడికి చేరిన గణనాథుడు



-మిగతా 2లో

**కర్నూలు(కల్చరల్, న్యూసిటీ) సెప్టెంబరు 15:** నగరంలో గణేశ నిమజ్జనోత్సవాలు ఆదివారం ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయేంతవరకు కమనీయంగా సాగాయి. చిన్నా పెద్ద విగ్రహాలు కలిపి సుమారు రెండు వేల విగ్రహాలను ప్రతిష్టించగా, నగరంలో వినాయక ఘాట్‌తో పాటు సుంకేసుల రోడ్డులోని స్టాంటనపురం కేసీ కెనాల్, సంకల్‌బాగ్ తుంగభద్ర నదిలో విగ్రహాలను నిమజ్జనం చేశారు. నగరపాలక సంస్థ అధికారులు మొత్తం ఎనిమిది భారీ క్రేనలను ఏర్పాటు చేశారు. నగరంలో ప్రధాన మార్గాలు తప్పించి, ఎనఆర్ పేట, ప్రకాశ నగర్, రోజావీధి, ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీ, అశోక్‌నగర్, వెంకటరమణ కాలనీ, బాలాజీ నగర్, రామలింగేశ్వరనగర్ తదితర ప్రాంతా లకు చెందిన ఉత్సవ మూర్తులను స్టాంటన పురం వద్దగల కేసీ కెనాల్‌లో నిమజ్జనం చేశారు. గాంధీటవర్స్ అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం కేంద్రంలో టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ పూజలు నిర్వహించారు. నిమజ్జన కార్యక్రమం మధ్యాహ్నం రెండు గంటలకు మొదలు పెట్టాల్సి ఉండగా అతిథుల రాక ఆలస్యం కావడంతో మధ్యాహ్నం మూ డు గంటలకు ప్రారంభించారు. మధ్యాహ్నం నుంచే వివిధ ప్రాంతాల్లోని విగ్రహాలు ప్రధాన రోడ్లపైకి చేరుకున్నాయి. నగరంలో నాలుగు ప్రాంతాల నుంచి వినాయక విగ్రహాలను కేసీ కెనాల్ వద్ద గల వినాయక ఘాట్‌కు తరలించారు.

## ముగ్గురు ఐపీఎస్‌లకు చంద్రబాబు ప్రభుత్వం షాక్..!

2లో

## ఇంజనీర్లకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు

**కోనోకార్పస్ చెట్టు పర్యావరణానికి హానికరం..**

మనం నాటిన ప్రతి చెట్టు మన పిల్లల భవిష్యత్తును నిర్దేశిస్తుందని, అయితే పరిష్కారంగా కనిపించిన కోనోకార్పస్ చెట్టు ప్రస్తుతం పర్యావరణానికి, నీటికి, ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. "మన భూమి అందాన్ని, సమతుల్యతను దెబ్బతీసే వృక్ష జాతులను అనుమతించబోము. భారత మూలాలను, దేశ మట్టిని సంరక్షించే చెట్లతో రక్షించాల్సిన సమయం ఇది. వేప, రావి, మన స్థానిక సంరక్ష చెట్లను ఎంచుకుందాం. ఇవాళ మనం తీసుకునే నిర్ణయాలపైనే మన పిల్లల భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. జీవవైవిధ్యాన్ని పరిరక్షించండి" అంటూ పవన్ కల్యాణ్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు

## ఆన్‌లైన్‌లో లాటరీ ద్వారా మద్యం షాపుల లైసెన్సులు జారీ?

ఈ నేపథ్యంలో ఈ నెల 18న జరిగే మంత్రి మండలి సమావేశంలో కొత్త లిక్కర్ పాలసీపై పూర్తిస్థాయిలో చర్చించి, ఈ నెల 19వ తేదీన దీనికి సంబంధించిన ప్రకటన రిలీజ్ చేసే అవకాశం ఉంది. కొత్త మద్యం పాలసీకి సంబంధించి ఇప్పటికే దశలవారిగా సమీక్ష సమావేశాలు నిర్వహించారు సీఎం చంద్రబాబు. వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న మద్యం పాలసీపై ఏపీ అధికారులు స్టడీ చేశారు.

తెలంగాణ, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లో అమల్లో ఉన్న మద్యం విధానాలపై అధ్యయనం చేశారు. అక్కడ ఏయే రకాల బ్రాండ్లు అమ్ముతున్నారు, ధరలు ఏ విధంగా ఉన్నా, మద్యం షాపుల నిర్వహణ ఎలా ఉంది తదితర అంశాలపై పూర్తి స్థాయిలో అధ్యయనం జరిగింది. దీనిపై ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు అధికారులు. దీనిపై దశలవారిగా సీఎం చంద్రబాబు, మిగతా మంత్రుల సమక్షంలో చర్చలు జరిపారు. తర్వాత ఒక కొత్త మద్యం విధానాన్ని రాష్ట్రంలో ప్రవేశపెట్టాలని చంద్రబాబు సర్కార్ నిర్ణయించింది.

ఈ నెల 18న మంత్రి మండలిలో కొత్త లిక్కర్ పాలసీపై చర్చించి ఆమోదం తెలిపిన తర్వాత 19వ తేదీన నూతన మద్యం పాలసీకి సంబంధించిన ప్రకటనను ప్రభుత్వం విడుదల చేయనుంది. అక్టోబర్ 1వ తేదీ నుంచి రాష్ట్రంలో కొత్త మద్యం విధానాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. గత ప్రభుత్వం హయాంలో మద్యం పాలసీలో అమలు చేసిన విధివిధానాలను పూర్తిగా రద్దు చేసే అవకాశం ఉంది. ఆన్ లైన్ లో లాటరీ ద్వారా మద్యం షాపులు ప్రైవేట్ వ్యక్తులకు కేటాయించే విధానాన్ని చంద్రబాబు సర్కార్ తీసుకురానుంది. గత ప్రభుత్వం హయాంలో ప్రభుత్వమే మద్యం షాపులు నిర్వహించింది. ప్రభుత్వమే సొంత మద్యం బ్రాండ్లను తయారు చేసింది.

అయితే, జగన్ ప్రభుత్వం.. గతంలో ఉన్న బ్రాండ్లను రద్దు చేసి, నకిలీ బ్రాండ్లు సృష్టించి, నకిలీ మద్యాన్ని సరఫరా చేయటం వల్ల రాష్ట్రంలో అనేకమంది ప్రాణాలు కోల్పోయారని తెలుగుదేశం పార్టీ తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ క్రమంలో తక్కువ ధరకే నాణ్యమైన మద్యాన్ని సరఫరా చేసే విధంగా విధానం తీసుకొస్తామని ఎన్నికల సమయంలో టీడీపీ, జనసేన హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆ తరహా విధానంపై దృష్టి సారించింది.

## రాహుల్‌పై కేంద్ర మంత్రి టెర్రరిస్టు వ్యాఖ్యలు... కాంగ్రెస్ ఫైర్

రాహుల్ చేసిన వ్యాఖ్యలను మోస్ట్ వాంటెడ్ పీపుల్, వేర్పాటువాదులు, బాంబులు–తుపాకులు–బుల్లెట్ల తయారీ నిపుణులు మాత్రమే అభినందిస్తుంటారు. వాళ్లు కూడా రాహుల్ మాట్లాడినట్టే మాట్లాడతారు. అలాంటి వ్యక్తులు రాహుల్‌కు మద్దతు తెలుపుతున్నారంటే దేశంలో నెంబర్ వన్ టెర్రరిస్టు ఆయనే అవుతారు" అని బిట్టూ విమర్శించారు.

విమానాలు, రైళ్లు, రోడ్డు పేల్చేసేందుకు కుట్రలు పన్నే ఈ దేశ శత్రువులే రాహుల్ గాంధీకి మద్దతిస్తుంటారని బిట్టూ విమర్శించారు. దేశానికి అతిపెద్ద శత్రువును పట్టుకునేందుకు రివార్డంటూ ఏదైనా ఉంటే ఆ వ్యక్తి రాహుల్ గాంధీయేనని తన అభిప్రాయమని చెప్పారు. ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీని బిట్టూ విడిచిపెట్టి బీజేపీలో చేరారు.

**కాంగ్రెస్ ఫైర్..**

రాహుల్ గాంధీని నెంబర్ వన్ టెర్రరిస్టుతో పోలుస్తూ కేంద్ర మంత్రి బిట్టూ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ మండిపడింది. ఇలాంటి వ్యక్తులను చూస్తే జాలి కలుగుతుందని, కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు రాహుల్‌గాంధీపై ప్రశంసలు కురిపించి, ఇప్పుడు బీజేపీలో చేరడంతో ఆ పార్టీకి విధేయుత చాటుకుంటున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత సందీప్ దీక్షిత్ ఆక్షేపణ తెలిపారు.

**రాహుల్ ఏమన్నారు?**

వర్జీనియాలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో సిక్కుల గురించి రాహుల్ మాట్లాడుతూ "సిక్కులు తలపాగా ధరించడానికి అనుమతిస్తారా లేదా అనే దానిపై భారత్‌లో పోరాటం జరుగుతోంది. సిక్కులు కడాను ధరించి, గురుద్వారాలను సందర్శించడానికి అనుమతిస్తారా? ఇది సిక్కులకు మాత్రమే కాదు. అన్ని మతాలకు సంబంధించినది" అని రాహుల్ వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలపై బీజేపీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ఢిల్లీలోని రాహుల్ ఇంటిముందు ఆందోళన సైతం చేపట్టింది.

## సీఎం రాజీనామాకు 48

న్యాయం జరిగిందని, ఇప్పుడు ప్రజాకోర్టు నుంచి న్యాయం కావాలని అన్నారు. ప్రజల ముందుకే వెళ్తానని చెప్పారు.

నవంబర్‌లో జరగనున్న మహారాష్ట్ర ఎన్నికలతో పాటే ఢిల్లీకి కూడా ఎన్నికలు నిర్వహించాలని కేజ్రీవాల్ డిమాండ్ చేశారు.

ఢిల్లీ సీఎం రాజీనామా ప్రకటనపై బీజేపీ విమర్శలు గుప్పించింది. అసెంబ్లీని రద్దుకు ఆప్ సర్కార్ సిఫారసు చేసి తాజా ఎన్నికలను కోరాలని డిమాండ్ చేసింది. ఇప్పుడే రాజీనామా చేయాల్సిన అనివార్యత ఎందుకు వచ్చిందో చెప్పాలని బీజేపీ ప్రతినిధి సుధాన్షు త్రివేది ప్రశ్నించారు. రాజకీయాల్లో సరికొత్త దిగజారుడును తాము చూస్తున్నామని విమర్శించారు. సీఎం కార్యాలయానికి వెళ్లొందంటూ సుప్రీంకోర్టు ఒక సీఎంను ఆదేశించించడం ఇదే మొదటిసారని అన్నారు.

## అమరావతి నిర్మాణాలకు నిపుణుల కమిటీ గ్రీన్ సిగ్నల్

భవనాలు, పునాదులు పటిష్టంగానే ఉన్నాయని.. ఐదేళ్లుగా బయటకు కనిపిస్తూ తుప్పు పట్టిన ఇనుమును తొలగించి కెమికల్ ట్రీట్ మెంట్ చేసి భవన నిర్మాణాలను కొనసాగించవచ్చని ఐఐటీ నిపుణులు నిర్ధారణకు వచ్చారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అఖిల భారత సర్వీసుల అధికారులు, గ్రూప్ 1 అధికారులు, ఎన్జీవోలు, నాలుగో తరగతి ఉద్యోగుల కోసం నిర్మించిన భవనాలు కూడా పటిష్టంగా ఉన్నట్లు హైదరాబాద్ ఐఐటీ నిపుణుల బృందం తేల్చింది. వాటి నిర్మాణాలను కొనసాగించవచ్చని ఆ బృందం రిపోర్టు ఇచ్చింది.

## నంద్యాలలో కలకలం

**మంత్రి ఎన్ఎండి ఫరూక్ కుమారుడు, జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పై నలుగురు దుండగులు దాడి**



**నంద్యాల క్రైమ్ సెప్టెంబర్ 15( రిపబ్లిక్ న్యూస్):** రాజ్ థియేటర్ నుంచి తన వాహనంలో వెళ్తుండగా ఒకే మోటార్ బైక్ పై వెంబడించిన నలుగురు ఫిరోజ్ వెహికల్ పై దాడి చేశారు వెంటనే అప్రమత్తమైన ఫిరోజ్.. వాహనం దిగి దాడికి పాల్పడిన వారిని పట్టు కోవడం జరిగింది వన్ టౌన్ పోలీసులకు అదుపులో ఫిరోజ్ పై దాడికి ప్రయత్నించిన ఒక దుండగుడు అదుపులోకి తీసుకోగామరో ముగ్గురు పరారయ్యారు. పోలీసుల అదుపులో తీసుకున్న వ్యక్తి ఒకటో పట్టణ పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం.నాలుగు దశాబ్దాలకు పైగా రాజకీయంగా ఉన్న న్యాయశాఖ మంత్రిఎన్ ఎం డి ఫరూక్ కుటుంబం మొదటి నుండి వివాదాలకు దూరంగా ఉంటూ వస్తుంది ఫరూక్ కుమారులలో ఐదు మందిలో ఫిరోజ్

రాజకీయంగా ప్రజలలో ఉంటూ పేరుగాంచారు. ఫిరోజ్ పై దాడి జరగడంతో టిడిపి పార్టీలోనే కాదు పట్టణంలోనే సంచలనం సృష్టించింది

# విపక్షాలపై ప్రధాని మోదీ విసుర్లు

ఆయన వ్యంగ్యంగా పేర్కొన్నారు. ఈ ప్రభుత్వ హయాంలో తమకు ఏం జరిగిందో రాష్ట్ర ప్రజలకు బాగా అర్థమైందన్నారు. అందుకే భవిష్యత్తు గురించి వారంతా ఆలోచిస్తున్నారని చెప్పారు. ఈ హేమంత్ సోరెన్ ప్రభుత్వంలో ఉద్యోగాలు విక్రయించేందుకు పుట్టగొడుగుల్లా గ్యాంగులు వెలిశాయని విమర్శించారు.

జార?ండ్ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో అక్రమ చొరబాట్లు ఒకటన్నారు. రాష్ట్రంలోని సంతాల్ పరిగణ, కొల్హాన్ ప్రాంతాల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉందని తెలిపారు. కానీ దీనిని ఒప్పుకునే పరిస్థితిలో అధికార పార్టీ మాత్రం లేదన్నారు. రాష్ట్రానికి ప్రధాన శత్రువులు జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేజీ పార్టీలనేని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. అధికారం అందుకొనే క్రమంలో ఓటు బ్యాంక్ రాజకీయాలకు ఆ యా పార్టీలు తెర తీశాయని ఆరోపించారు.

అధికారంలోకి వస్తే.. ఆ ఘటనపై విచారణ జరిపిస్తాం..

ఈ ఏడాది చివరల్లో జార?ండ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలొకి వస్తే.. ఎక్సైజ్ కానిస్టేబుళ్ల ప్రవేశం కోసం నిర్వహించిన పరీక్షల సందర్భంగా జరిగిన తొక్కిసలాటపై పలువురు మరణించారన్నారు. ఈ అంశంపై విచారణ జరిపిస్తామని జార?ండ్ ప్రజలకు ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. అలాగే ప్రధాన మంత్రి జన్ మాన్ యోజన ద్వారా అదివాసీలకు బహుళ ప్రయోజనం చేకూరుతుందన్నారు. సెప్టెంబర్ 15వ తేదీన తొలి విడతలో భాగంగా ప్రధాన మంత్రి అవాస్ యోజన్ గ్రామీణ పథకం ద్వారా వేలాది మంది అర్హులైన లబ్దిదారులకు పక్కా ఇళ్లు లభిస్తాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

జార?ండ్‌లోని స్టీల్ సీటి జంషెడ్‌పూర్‌లో ర్యాలీలో పాల్గొనేందుకు ప్రధాని మోదీ రాంచీ చేరుకున్నారు. అక్కడి నుంచి జంషెడ్‌పూర్‌కు హెలికాప్టర్‌లో చేరుకోవాల్సి ఉంది. కానీ వాతావరణం అనుకూలించ లేదు. దీంతో రోడ్డు మార్గంలో ర్యాలీ ప్రాంతానికి ప్రధాని మోదీ చేరుకున్నారు. జార?ండ్ ముక్తి మోర్చకు చెందిన మాజీ సీఎం చంపయ్ సోరెన్ ఆ పార్టీని వీడి బీజేపీలో చేరిన సంగతి తెలిసిందే.

## గంగమ్మ ఒడికి చేరిన గణనాథుడు

వినాయక ఘాట్ వద్ద రోడ్డుకు అటూ, ఇటూ తిరునాళ్లను తలపించేలా పిల్లలను ఆకర్షించే విభిన్న రకాల బొమ్మలతో వ్యాపారులు స్టాళ్లు ఏర్పా టు చేసుకున్నారు. గణేశ ఉత్సవాల్లో పిల్లలు ముఖాలకు పెట్టుకునే మాస్కులు, టోపీలు, బెలూన్లు వంటి వాటిని ఆకర్షణీయంగా కనిపించాయి. నిమజ్జనాన్ని తిలకించేందుకు కొందరు నగరవాసులు ద్విచక్ర వాహనాలపై తమ పిల్లలను కూర్చొబెట్టుకొని ప్రధాన రహదారుల్లో తిరిగారు.కలెక్టరేట్‌లోని పరిపాలన గణపతి ఉత్సవ మూర్తికి ఇనచార్జి ఆర్డీవో చిరంజీవి పూజలు చేసి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

నగర పాలక సంస్థ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ప్రతిష్టించిన ఎనిమిది అడుగుల మట్టి విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. నిమజ్జనోత్సవంలో భాగంగా కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ నృత్యాలు చేసి అందరిని ఉత్సాహపరిచారు. వీరితో పాటు అధికారులు, యువత డాన్స వేస్తూ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, ఏఈలు దినేష్, జనార్దన, సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

**వినాయక ఘాట్ వద్ద గణనాథుల నిమజ్జనం**

నగర నడిబొడ్డునగల కేసీ కెనాల్ ఒడ్డున ఉన్న వినాయక ఘాట్‌లో ఊరేగింపుగా తీసుకువచ్చిన గణేశ విగ్రహ మూర్తులను నిమజ్జనం చేశారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో పాటు ఆర్డీవో శేషిరెడ్డి, విశ్రాంత కలెక్టర్ రాంశంకర్ నాయక్, వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన, ఎస్వీ మోహనరెడ్డి, గణేశ మహోత్సవ కేంద్ర సమితి ఉమ్మడి జిల్లా కార్యదర్శి డాక్టర్ ఎం.నాగఫణిశాస్త్రి, జిల్లా, నగర అధ్యక్షుడు వేణుగోపాల్, డాక్టర్ మోక్షేశ్వరుడు, 41వ వార్డు కార్పొరేటర్ శ్వేతారెడ్డి, ఉత్సవ కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు. జేసీ డాక్టర్ బి. నవ్య జ్యోతి ప్రజ్వలన చేయగా, ఉత్సవాల ధ్వజారోహణ నందిరెడ్డి సాయిరెడ్డి చేపట్టారు. నిమజ్జన కార్యక్రమాన్ని ఎస్పీ, నగర మేయర్ ప్రారంభించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన పరిపాలన గణపతికి వారు పూజలు చేసి నిమజ్జనోత్సవానికి శ్రీకారం చుట్టారు. అనంతరం నగరపాలక సంస్థలో ఏర్పాటు చేసిన గణపతి మూర్తిని నిమజ్జనం చేశారు. రాంభొట్ల దేవాలయం నుంచి వచ్చిన వివేకానంద యూత వారి విగ్రహాన్ని నిమజ్జనం చేయడంతో వరుసగా విగ్రహాలను తరలించే ఏర్పాట్లు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

విద్యుద్దీపాలతో శోభాయమానంగా వినాయక ఘాట్

వినాయక ఘాట్‌ను విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. కెనాల్‌కు రెండు వైపులా బారికేడ్లు ఏర్పాటు చేశారు. భక్తులు నీళ్లలోకి దిగకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు. కేసీ కెనాల్ వద్ద జరిగిన నిమజ్జన వేడుకల్లో విశ్రాంత ఆచార్యులు డాక్టర్ కొట్టే చెన్నయ్య, పరశురాముని రామకృష్ణ వ్యాఖ్యానం చేశారు. ఉత్సవ సమితి నాయకులు రంగస్వామి, గూడా సుబ్రహ్మణ్యం, సందడి మహేష్, సందడి సుధాకర్, అక్కెం విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో రాంబొట్ల దేవాలయం నుంచి వినాయక ఘాట్ వరకు ఎనిమిది తాగునీటి కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎనిమిది కూడళ్లలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. పాతనగరం నుంచి వినాయక ఘాట్ వరకు వివిధ ప్రాంతాల్లో పలు స్వచ్ఛంద సేవా సంస్థలు అన్నదానం, అల్పాహారం పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేశాయి. అలాగే మంచినీళ్ల ప్యాకెట్లను భక్తులకు ఉచితంగా పంపిణీ చేశారు.

**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు**

గణేశ నిమజ్జనోత్సవంలో భాగంగా కేసీ కెనాల్ ఘాట్ వద్ద సంస్కార భారతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రభుత్వ శారద సంగీత, నృత్య కళాశాల విద్యార్థుల నృత్యా లు, సూర్యకళా అకాడమీ, పవన స్టార్ మ్యూజిక్, అన్నమాచార్య సేవా ట్రస్టుచే గణపతి నృత్యాలు, లలితా పీఠం వారి కోలాట నృత్యాలు, విజ్ఞాన పీఠం పాఠశాల విద్యార్థుల చెక్కభజన, నాట్యవేద కళానిలయం, శ్రీరామకృష్ణ పాఠశాల విద్యార్థుల బృంద నృత్యం ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు అతిథులు జ్ఞాపికలు, ప్రశంసాపాత్రాలు అందజేశారు.

**నిమజ్జనోత్సవంలో పలుచోట్ల అన్నదానాలు**

గణేశ నిమజ్జనోత్సవం సందర్భంగా నగరంలో వివిధ ప్రాంతాల్లో అన్నదాన కేంద్రాలు ఏర్పాటు చేసి భక్తులకు పంపిణీ చేశారు. నగరంలో జడ్పీ కార్యాలయ సమీపంలోని కేఈ ప్లాజాలో మాజీ మంత్రి, సీనియర్ టీడీపీ నేత కేఈ ప్రభాకర్ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి స్పందన లభించింది. నగరం లోని వీకర్ సెక్షన కాలనీలోగల విగ్రహం వద్ద సీనియర్ రంగస్థల నటుడు గాండ్ల లక్ష్మన్న ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. బుధవారపేటలోని శ్రీలక్ష్మీ గణేశ నగర భక్తబృందం సుశీల నేత్రాల యంలో ఏర్పాటు చేసిన విగ్రహం నిమజ్జనంలో మహిళా భక్తులు ఏకరూప దుస్తులతో ఆకట్టుకున్నారు. ఎర్రబురుజు వినాయకుడి విగ్రహం తరలింపులో మహిళ ట్రాక్టర్ నడుపుతూ భక్తులకు ఆకట్టుకున్నారు.

కల్లూరు: గణనాథుడికి జేజేలంటూ డప్పు వాయిద్యాల నడుమ వినాయ కుడి విగ్రహాలను ఆదివారం నిమజ్జనానికి తరలించారు. కల్లూరు అర్బన పట్ట ణంలో ఆయా వార్డుల్లో మండపాల కమిటీ సభ్యులు, భక్తబృందాల ఆధ్వర్యంలో యువకులు, మహిళలు నృత్యాలు చేస్తూ విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు.

వినాయక మండపాల్లో గౌరు చరిత పూజలు: పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత ఆదివారం 19, 20 వార్డుల్లో వినాయక విగ్రహాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, మహిళలు గౌరు చరితను సన్మానించారు. కార్యక్రమంలో పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగి రెడ్డి పాల్గొన్నారు. అలాగే నగరంలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు అదివారం ప్రత్యేక పూజలు, లడ్డూ వేలం, ఉట్టికొట్టే ఆట, డీజేలతో యువత నృత్యం చేస్తూ కేరింతలు కొట్టారు. కొన్ని ప్రాంతాల్లో విద్యుత తీగలు కిందకు ఉండటంతో వినాయక శోభాయాత్ర సమయంలో కరెంట్ తీసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు.

ఓర్వకల్లు: మండలంలోని సోమయాజులపల్లె గ్రామంలో వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. 9 రోజులుగా గణేష్ మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు చేశారు. వినాయకుని లడ్డూను వేలం పాట ద్వారా దక్కించుకున్నారు. వినాయకున్ని ట్రాక్టర్‌పై నిమజ్జనానికి తరలించారు. అనంతరం కాల్వబుగ్గలో నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## వరదల్లోనూ బురద రాజకీయం

గత నెల 31న ఉమ్మడి కృష్ణా జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు తోడు కృష్ణా ఉపనదులైన మున్నేరు, పాలేరు నదుల నుంచి రికార్డు స్థాయిలో 11 లక్షల 43 వేల క్యూసెక్కుల వరద నీరు ప్రకాశం బ్యారేజీకి చేరింది. మరోవైపు బుడమేరు వాగుకు మూడు చోట్ల పెద్దగండ్లు, 16 చోట్ల చిన్నగండ్లు పడడంతో విజయవాడలోని సింగ్‌నగర్ సహా 16 డివిజన్లలోని కాలనీలు జలదిగ్బంధం అయ్యాయి. 2.76 లక్షల మంది ప్రజానీకం నిర్వాసితులుగా మారారు. ఈ రెండూ విజయవాడ పరిసర ప్రాంతాలకు ఏకకాలంలో సంభవించిన వేర్వేరు విపత్తులు. ఈ విపత్తుల బారి నుంచి ప్రజలను రక్షించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అధికార యంత్రాంగం, కేంద్ర సహాయక బృందాలు, పోలీసు యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, సేవా సంస్థలు... అందరూ ఏకతాటిపైకి వచ్చి నిర్విరామ కృషి చేయడంతో ప్రాణనష్టం తగ్గింది. బాధితులకు ఆహారం, త్రాగునీరు, పాలు, మందులు సరఫరా చేయడంలో ప్రభుత్వం సఫలీకృతమైంది.

ఇదిలావుంటే... కరకట్టపై ఉన్న చంద్రబాబు ఇంటిని రక్షించేందుకే అర్ధరాత్రి వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ 11 లాక్‌లు ఎత్తివేశారని, బుడమేరు వరదను మళ్లించి విజయవాడను ముంచేశారని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ఇది ముమ్మాటికీ మ్యాన్ మేడ్ ఫ్లడ్స్ అని కూడా సెలవిచ్చారు. జగన్‌రెడ్డి అవగాహన రాహిత్యానికి, అజ్ఞానానికి ఆయన చేసిన వ్యాఖ్యలే మచ్చుతునక. విజయవాడ నగరానికి ఒకవైపు బుడమేరు ఉంటే, మరో వైపున కృష్ణా నది ప్రవహిస్తుంది. వాటి ప్రవాహ మార్గాలు వేర్వేరు. బుడమేరు అనేది కృష్ణానదికి ఉపనది కాదు. బుడమేరు పరివాహక ప్రాంతానికి, కృష్ణానది పరివాహక ప్రాంతానికి సంబంధం లేదు. 'కృష్ణానదికి గరిష్టంగా 11.43 లక్షల క్యూసెక్కులకు పైగా వరద వచ్చింది. బుడమేరుకు వచ్చిన వరద 35 వేల క్యూసెక్కులే. అంటే 35 వేల క్యూసెక్కులను ఆపితే కృష్ణానదికి వచ్చే వరదంతా ఆగిపోతుందా' అని అందరూ ఆశ్చర్యపోయారు.

ఇదే సమయంలో వైసీపీకి చెందినవారే పనిగట్టుకుని రాజధాని అమరావతిపై విషం చిమ్మడం మొదలుపెట్టారు. సచివాలయం, హైకోర్టు, ఎమ్మెల్యే క్వార్టర్స్, ఐఏఎస్ అధికారుల నివాస సముదాయాలు నీట మునిగాయని, ఈ ప్రాంతం రాజధానికి అననుకూల ప్రాంతం అని జగన్‌రెడ్డికి చెందిన నీలి మీడియా, కూలి మీడియా అసత్య కథనాలు వండి వార్చింది. వాస్తవానికి వచ్చిన వరద వచ్చినట్టు కొండవీటి వాగు ఎత్తిపోతల ద్వారా కృష్ణానదిలోకి వెళ్ళిపోయింది. ఎక్కడా నీరు నిలవలేదు. కేవలం ఇది అమరావతి ప్రాంతంపై పనిగట్టుకు చేసిన తప్పుడు ప్రచారం తప్ప మరొకటి కాదు. అదేవిధంగా 'రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా? సాయం అందించడంలో ఇంత చేతకానితనమా?' అంటూ ఎక్స్ వేదికగా జగన్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారు. నిజానికి అనుభవజ్ఞుడైన చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న కారణంగానే ఇంత పెద్ద విపత్తులు ఏకకాలంలో సంభవించినా యుద్ధప్రాతిపదికన చేపట్టిన చర్యలు కారణంగా ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. జగన్‌రెడ్డే కానీ ఈ సమయంలో ముఖ్యమంత్రిగా ఉండివుంటే అతని అనుభవరాహిత్యానికి కృష్ణా జిల్లా మొత్తం ఈపాటికి కొల్లేటిలో కలిసిపోయేదనేది వాస్తవం. గతంలో కృష్ణానదికి వరదలు వచ్చినప్పుడు అధికార యంత్రాంగం ముందస్తు హెచ్చరికలు చేసినా తగు చర్యలు తీసుకోకుండా ప్రకాశం బ్యారేజీ వద్ద పడవ అడ్డుపెట్టి చంద్రబాబు ఉంటున్న నివాసం మునిగిందా, లేదా అని డ్రోన్ కెమెరాలతో పరీక్షించిన విషయం అందరికీ తెలిసిందే. అటువంటి మనస్తత్వం ఉన్న వ్యక్తి ఇప్పుడు మళ్ళీ అధికారంలో ఉండివుంటే జరిగే విపత్తు ఊహించడానికి కూడా సాధ్యం అయ్యేది కాదు.

నిజానికి బుడమేరు అనేది వాగు అన్నది కూడా జగన్‌రెడ్డికి తెలియదు. బురద చల్లడం తప్ప బుడమేరు చరిత్ర ఆయనకి తెలియదు. బుడమేరు వాగు అనేది కొల్లేరు సరస్సులో కలిసే అతిపెద్ద వాగు. ఖమ్మం జిల్లా సరిహద్దు ప్రస్తుత ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలంలోని జమ్ములవోలు కొండలలో ప్రారంభమై ఈ వాగు మైలవరం నియోజకవర్గంలో ఎన్టీఆర్ జిల్లాలోకి ప్రవేశిస్తుంది. రెడ్డిగూడెం, మైలవరం, జి.కొండూరు మండలాల్లోని కొండవాగు, కోతులవాగు, పులివాగు, భీమ్‌వాగు, లోయవాగు, దొర్లింతల వాగులతో పాటు విస్సన్నపేట, తిరువూరు నుంచి వచ్చే కొన్ని ఏరులను కూడా కలుపుకుని ముందుకు సాగుతుంది. ఇవన్నీ కలిసాక, వెలగలేరు మీదుగా విజయవాడ శివారులోని సింగ్‌నగర్, గూడవల్లి, గన్నవరం, బాపులపాడు, గుడివాడ వైపు సాగి చివరకు కొల్లేరులో కలుస్తుంది. ఈ వాగు మొత్తం పొడవు 113 కిలోమీటర్లు. పరివాహక ప్రాంతం 1,880 చదరపు కిలోమీటర్లు. బుడమేరు గరిష్ట నీటి సామర్థ్యం 11 వేల క్యూసెక్కులు మాత్రమే. దీని ఉధృతి తగ్గించేందుకు 1960ల్లో నాటి ప్రభుత్వం జి.కొండూరు మండలం వెలగలేరు వద్ద హెడ్ రెగ్యులేటర్‌ను నిర్మించింది. దీని ద్వారా కిందకు వరద ప్రవాహాన్ని నియంత్రించేవారు. తరువాత దీని నుంచి డైవర్షన్ ఛానెల్ తవ్వారు. ఈ కాలువ సామర్థ్యం 7,500 క్యూసెక్కులు. అధికంగా వచ్చే వరద ఈ ఛానెల్ ద్వారానే ప్రవహించి, ఇబ్రహీంపట్నం సమీపంలోని పవిత్ర సంగమం వద్ద కృష్ణానదిలో కలుస్తుంది. బుడమేరుకు వరద వచ్చిన ప్రతీసారీ వెలగలేరు వద్ద 40 వేల క్యూసెక్కులకు పైన నీటి ప్రవాహం ఉంటుంది. అందువలన డైవర్షన్ ఛానెల్ సామర్థ్యం సరిపోక విజయవాడను తరచూ ముంచుతోంది. 1991లో వరద నియంత్రణ ప్రాజెక్టులో భాగంగా డైవర్షన్ ఛానెల్ సామర్థ్యాన్ని 15 వేల క్యూసెక్కులకు పెంచారు. 2006లో బుడమేరుకు సుమారు 70 వేల క్యూసెక్కుల వరద పోటెత్తి విజయవాడను ముంచెత్తింది. 1903 నుంచి ఇప్పటివరకు బెజవాడ పదిహేడుసార్లకు పైగా వరద ముంపునకు గురయ్యింది. ఈ వరదలు పెద్దఎత్తున ఆస్తినష్టాలకు కారణమయ్యాయి.

వరదను అరికట్టాలంటే మళ్లింపు కాలువ విస్తరణే మార్గమని నిపుణులు ప్రతిపాదించారు. అందుకు పోలవరం కుడికాలువకు బుడమేరుతో అనుసంధానం చేశారు. ఆ విధంగా పోలవరం నుంచి వచ్చే నీటిని కృష్ణానదిలో కలిపేందుకు ప్రణాళిక చేశారు. పోలవరం కుడికాలువను 37,500 క్యూసెక్కులతో డిజైన్ చేయగా, ప్రస్తుత సామర్థ్యం 8,500 క్యూసెక్కులు మాత్రమే. 1970ల్లో ఎన్టీపీఎస్ వచ్చింది. ఈ సంస్థ అభ్యంతరాల వల్ల కాలువ సామర్థ్యం పెంచలేదన్న అభిప్రాయాలూ ఉన్నాయి. 1964లో బుడమేరుకు రికార్డు స్థాయిలో వరదలొచ్చినప్పుడు విజయవాడ మునగడంతో అప్పటి కేంద్ర జలసంఘం ఏసీ మిత్రా నేతృత్వంలో నిపుణుల కమిటీ వేసింది. నదీ ప్రవాహంలో మలుపులు సరిచేయాలని, బ్రహ్మయ్యలింగం చెరువు నిల్వ సామర్థ్యం పెంచాలని, కొన్ని రిజర్వాయర్లు నిర్మించాలని మిత్రా కమిటీ సూచించింది. అనేక కారణాలతో ఇవేమీ ఆచరణరూపం దాల్చలేదు.

ఇక బుడమేరు ఆక్రమణలకు గురి కావడంతో అది సహజంగా కొల్లేరులో కలిసే మార్గాలు మూసుకుపోయాయి. కొల్లేరులో 42 శాతం అక్రమ చేపల చెరువులు, మరో 9 శాతం వ్యవసాయ భూములు ఉన్నాయని అంచనా. గత ముప్పై ఏళ్లగా కొల్లేరులో అక్రమ ఆక్రమణలు సాగుతూనే ఉన్నాయి. ఇవే బుడమేరు విజయవాడను ముంచెత్తడానికి దారి తీస్తున్నాయి. ఇదీ బుడమేరు చరిత్ర. జగన్‌రెడ్డికి ఈ చరిత్ర తెలియకపోవడంతో ఏం మాట్లాడాలో అర్థంకాక ప్రభుత్వంపై బురద చల్లుతున్నారు.

ఒకవైపు కూటమి ప్రభుత్వం వరద బాధితులను అన్నిరకాలుగా ఆదుకుంటూనే బుడమేరుకు పడిన మూడు గండ్లను ఆర్మీ ఇంజనీరింగ్ టాస్క్‌ఫోర్స్ విభాగం సాయంతో యుద్ధప్రాతిపదికన పూడ్చివేసింది. భవిష్యత్తులో మరోసారి ఇటువంటి ప్రమాదం తలెత్తకుండా ఉండేందుకు బుడమేరు వాగు, కొల్లేరు సరస్సులలో అక్రమ నిర్మాణాలను తొలగించడం, ఉపనదుల కరకట్టల ఎత్తు పెంచడం, అవసరమైన చోట రక్షణ గోడల నిర్మాణం చేపట్టడం, కాలువ సామర్థ్యం పెంచడం, మురుగునీటి పారుదల వ్యవస్థను బలోపేతం చేయడం లాంటి శాశ్వత ప్రణాళికలపై దృష్టి సారించింది. మరోవైపు ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో బాధితులకు అండగా నిలబడాల్సిన ప్రతిపక్ష వైసీపీ లేనిపోని అపోహలు సృష్టించి, ప్రజలను భయాందోళనలో ముంచెత్తడం గర్హనీయం. రెండుసార్లు వరద బాధితులను పరామర్శించడానికి వచ్చిన జగన్‌రెడ్డి ఏ విధమైన సహాయం చేయక పోగా, విపత్తు నుంచి ప్రజలను రక్షించడానికి నిర్విరామ కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వంపై బురదచల్లడం క్షమార్హం కాని నేరం. అధికారానికి దూరం చేసిన ప్రజలు రాజకీయాలకు కూడా అనర్హులుగా చేయకమునుపే జగన్‌రెడ్డి హుందాతనంగా వ్యవహరిస్తే మేలు. లేకపోతే ప్రజలే శాశ్వతంగా రాజకీయ సమాధి కడతారు.

# అధిక పంటల దిగుబడి పెంచేందుకు సేంద్రియ ఎరువులు వాడండి

### సేంద్రియ ఎరువుల వాడటం వలన రైతులకు ఉపయోగాలు
### షణ్ముఖ అగ్రిటెక్ సేంద్రియ ఎరువుల పై రైతులకు అవగాహన






**పల్నాడు జిల్లా ప్రజా రిపబ్లిక్ న్యూస్,:** అధిక పంటల దిగుబడి పెంచేందుకు సేంద్రియ ఎరువులను వాడాలని షణ్ముఖ అగ్రిటెక్ సంస్థ సీనియర్ డెవలప్మెంట్ ఎగ్జిక్యూటివ్ బిల్లా నవీన్ అన్నారురైతులు సేంద్రియ ఎరువులు వాడటం వల్ల భూమి సారవంతంగా తయారవ్వటమే కాక పంటలఅధిక దిగుబడి పేరిగి రైతన్నలు అధిక లాభాలు పొందవచ్చు అన్నారు. ఈ సందర్భంగా ఆదివారము పల్నాడు జిల్లా క్రోసురు మండలం వుయ్యందన గ్రామంలో రైతు సోదరులకు షణ్ముఖ అగ్రిటెక్ లిమిటెడ్ ఆధ్వర్యంలోసేంద్రియ ఎరువులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షణ్ముఖ అగ్రిటెక్ లిమిటెడ్ సంస్థ రైతుసోదరులకుగత14సంవత్సరాలుగానాణ్యమైన ఉత్పత్తులను అందిస్తూ అధిక దిగుబడులు సాదించేలా కృషి చేస్తున్నారని తెలిపారు. మా యొక్క ఉత్పత్తులైన వామ్ గోల్డ్, కింగ్ జైమ్, వసుధ గ్రాను లెస్, తేజస్ ప్లస్,విశ్వజిత్, తేజల్,పసిడి-6 , విరాట్ ప్రోమ్, విరాట్ సి ఎం ఎస్ ,మోక్ష , సూష్మ పోషకాలైన తారా జింక్,శక్తి బోరాన్, భాగ్య ,భాగ్యమ్యాక్స్, సేంద్రీయ ఎరువులైన జీవనమిత్ర, కీర్తి అంతగాకుండా జీవ సస్యరక్షకాలైన జీత్ అలాగే ఏకలవ్య వాడి అధిక దిగుబడులు సాధించవచ్చునని రైతులకు తెలియచేసారు. రైతన్నలు రసాయనిక ఎరువులు వాడటం పూర్తిగా తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలన్నారు. రసాయనిక ఎరువులు వాడటం వల్ల భూమిలో సారం తగ్గడంతో పాటు రైతులు ఎక్కువ పెట్టుబడి పెట్టాల్సి వస్తుందన్నారు. ఈ విషయం భూసార పరీక్షల్లో వెల్లడైందన్నారు కావున సేంద్రియ ఎరువులు వాడటం వల్ల రైతులకు తక్కువ పెట్టుబడి తో భూమిసార వంతంగాతయారవ్వడమే కాక పంట దిగుబడి అధికంగా వచ్చి రైతులు అధిక లాభాలు పొందుతారన్నారు. ఆదివారము వుయ్యందన గ్రామం క్రోసూరు మండలం వ్యవసాయ పంట పొలాల్లో పర్యటించి రైతులకు వరి,మిర్చి, పత్తి కురగాయల పంటల పై వచ్చే చీడపీడల గురించివివరించడం జరిగిందన్నారు. కంపెనీ ఉత్పత్తులను గురించిరైతులకు తెలియజేసారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ ఏరియా సేల్స్ మేనేజర్ %వీ%. మధుసూధన్ సర్, సేల్స్ ఆఫీసర్ దాసు సర్, సీనియర్ డెవలప్మెంట్ ఎగ్జిక్యూటివ్ బీ బిల్లా నవీన్, ఫీల్డ్ అధికారి శివ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మరియు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా అహోబిలేశుని కళ్యాణం



**ఆళ్లగడ్డ ప్రజా రిపబ్లిక్ న్యూస్:** ఆళ్లగడ్డ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన దిగువ అహోబిలంలో ఆదివారం శ్రీ ప్రహ్లాద వరద స్వామి శ్రీదేవి భూదేవి అమ్మవార్లకు కళ్యాణోత్సవం వైభవంగా జరిగింది. భాద్రపద శుద్ధ ద్వాదశి, శ్రవణా నక్షత్రం పురస్కరించుకుని వేద పండితులు కళ్యాణం నిర్వహించారు. ఈ కళ్యాణోత్సవంలో పెద్ద సంఖ్యలో ఉభయ దారులు పాల్గొన్నారు. వరుసగా సెలవు దినాలు రావడంతో ఎగువ దిగువ అహోబిలం క్షేత్రాలలో భక్తుల సందడి నెలకొంది.

# ప్రమాదాలకు కారణభూతమవుతున్న రోడ్లపై పంట నూర్పిడులు...





**ఆళ్లగడ్డ ప్రజా రిపబ్లిక్ న్యూస్:** ఆళ్లగడ్డ మండలంలోని పలు గ్రామాల రైతులు రోడ్లను పంట కళ్ళాలుగా మార్చేస్తున్నారు. ఆళ్లగడ్డ మండలంలోని బాచాపురం - నరసాపురం అటు అహోబిలం రోడ్డులోని హరినగరం గ్రామాల నడుమ ఆర్ అండ్ బి రోడ్డును పంట కళాలుగా మార్చి రైతులు రోడ్లపైనే ధాన్యాన్ని ఆరబోస్తుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎడమవైపున ఉన్న రోడ్డు మొత్తం రైతులు మొక్కజొన్న ధాన్యాన్ని ఆరబోయడంతో వాహనదారులు సింగిల్ రోడ్డు పైన కిలోమీటర్ల పొడవున ప్రయాణించాల్సి వస్తున్నది. ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంకు నిత్యం వందలాది సంఖ్యలో కార్లు వాహనాలు వస్తూ ఉంటాయి. ఈ నేపథ్యంలో రెండు వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు రోడ్డుపై ధాన్యం కుప్పలు ఉండడంతో వెళ్లేందుకు దారి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టూ వీలర్స్ లో వెళ్లే యాత్రికులు కూడా ఎదురుగా వాహనం వస్తే సైడుకు ఆపుకుని వెళ్లాల్సి వస్తున్నది. పూర్వం పంట నూర్పిడిలు , ధాన్యం ఆరబెట్టుకునేందుకు ప్రతి గ్రామంలో పంట కలాలు ఉండేవి. ప్రస్తుతం పంట కళాలు ఏ గ్రామంలో లేకపోవడంతో సీజన్లో పండించిన ధాన్యాన్ని రైతులు రోడ్లపైన ఆరబోస్తూ ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారు. గత ఏడాది వీటివల్ల ఎన్నో ప్రమాదాలు జరిగాయి. పోలీస్ శాఖ యంత్రాంగం కూడా చూచి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు అంటున్నారు. రోడ్లపై ధాన్యాన్ని ఆరబోసినప్పుడు రహదారి ప్రమాదాలు జరిగినప్పుడు బాధ్యత ఎవరిదో కూడా అర్థం కాని పరిస్థితి నెలకొంది. రోడ్లపై ధాన్యాన్ని ఆరబోసినప్పుడు వాటి నుండి వచ్చే దుమ్ము, ధూళి కూడా వాహనదారులపై పడుతున్నది. ఆర్ అండ్ బీ శాఖ అధికారులు, పోలీసు శాఖ అధికారులు రైతులు ధాన్యాన్ని రోడ్లపై ఆరబోయకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## తక్కువ పెట్టుబడి - అధిక దిగుబడి .

### విగర్ బయోటిక్ మాల్విక ఏరియా మేనేజర్ రవి ప్రకాష్ రెడ్డి.




**వెలుగోడు సెప్టెంబర్ 15 . రిపబ్లిక్ న్యూస్** తక్కువ పెట్టుబడి అధిక దిగుబడితో విగర్ బయోటిక్ మాల్విక కంపెనీ నుండి సోయాబీన్ సాగు చేసిన రైతులు సముఖంగా ఉన్నారని ఆ కంపెనీ ఏరియా మేనేజర్ రవి ప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం వెలుగోడు మండల పరిధిలోని రేగడగూడూరు గ్రామంలో ఆయన సోయాబీన్ పంట వేసిన రైతులతో క్షేత్రస్థాయి సమావేశం నిర్వహించారు. వెలుగోడు, గడివేముల, పాములపాడు మండలాల రైతులకు రీసెర్చ్ సోయాబీన్ అనే అంశం పైన అవగాహన కల్పించారు. రేగడ గూడూరు గ్రామంలో సుమారు 100 ఎకరాలలో ఈ పంట సాగు అయినట్టు తెలిపారు. సాగు విషయంలో రైతులు అనేక సమస్యలను కంపెనీ వారితో ఆరా తీశారు. రీసెర్చ్ సోయాబీన్ పంట తెగుళ్ల తట్టుకొని అధిక దిగుబడి నిస్తుందని మేనేజర్ రవి ప్రకాష్ రెడ్డి అన్నారు. ఈయనతో పాటు కంపెనీ సేల్స్ ఆఫీసర్ తులసిరామ్ ఉన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ ఇంజనీర్ల దినోత్సవం

### లయన్స్ క్లబ్ ఇంజనీర్స్ దినోత్సవ పురస్కారాల ప్రదానం
### జాతి నిర్మాతలు ఇంజనీర్లు: డాక్టర్ రవి కృష్ణ

**నంద్యాల సెప్టెంబర్ 15 (రిపబ్లిక్ న్యూస్):** భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి పురస్కరించుకుని ఆదివారం జాతీయ ఇంజనీర్ల దినోత్సవం నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ క్లబ్ కార్యాలయంలో నిర్వహించారు.నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నిజాముద్దీన్ అధ్యక్షతన, పి వి సుధాకర్ రెడ్డి సౌజన్యంతో జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ ముఖ్య అతిధిగా పాల్గొని మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవిత విశేషాలు వివరించారు. అన్ని రంగాల పురోగతికి మూలకారకులు ఇంజనీర్లు అని అన్నారు. నిజాముద్దీన్ మాట్లాడుతూ దేశ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర విశిష్టమైనదని అన్నారు.ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఈ ఎస్ సి పాలిటెక్నిక్ కళాశాల సీనియర్ అధ్యాపకులు ఉమామహేశ్వరప్ప, జి.వి.రాజశేఖర్ రెడ్డి లను శాలువా,జ్ఞాపికలతో సత్కరించి, లయన్స్ క్లబ్ జాతీయ ఇంజనీర్స్ దినోత్సవ పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి శిరిగిరి రమేష్ , జిల్లా చైర్మన్లు రవి ప్రకాష్, చంద్రమోహన్, ఉపాధ్యక్షులు కూర ప్రసాద్, సోమేశుల నాగరాజు,లయన్స్ క్లబ్ సభ్యులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.




## చనిపోవాలని సిద్ధమైన యువకుడిని కాపాడిన పోలీసులు

**నంద్యాల క్రైమ్, సెప్టెంబర్ 15, (రిపబ్లిక్ న్యూస్):** కుటుంబ కలహాలతో భార్య ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోవడంతో భార్య లేని జీవితం నాకు వద్దని రైలు పట్టాలపైకి వెళ్లి సెల్ఫీ వీడియో తీసుకుని ఆత్మహత్య చేసుకుంటానని వెళ్లిన యువకుడిని బ్లూకోట్ పోలీసులు కాపాడి తీసుకవచ్చినట్లు రెండో పట్టణ సీఐ ఇస్మాయిల్ ఆదివారం తెలిపారు. తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గడివేముల మండలం మంచాలకట్ట గ్రామానికి చెందిన అశోక్, మానసకు గత కొన్ని ఏళ్ల కిందట వివాహమైంది. కుటుంబ కలహాలతో మానస(22) శనివారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి శవపరీక్షల నిమిత్తం తీసుక వచ్చారు. భార్య లేని జీవితం నాకొద్దని చనిపోతానని ఆటోనగర్ సమీపంలోని రైల్వే పట్టాలపై వెళ్లిన అశోక్ సెల్ఫీవీడియో తీసుకుని బంధువులకు పంపించాడు. వారు వెంటనే పోలీసులను సంప్రదించారు. దీంతో జిల్లా ఎస్పీ అదిరాజ్సింగ్ రాణా ఆదేశాల మేరకు డీఎస్పీ పర్యవేక్షణలో టెక్నాలజీ ఉపయోగించి బ్లూకోట్ సిబ్బందిని అలర్ట్ చేశారు. రైల్వే పట్టాల నుంచి బస్టాండ్ వైపు వెళ్లి తిరిగి శ్రీనివాస సెంటర్ మీదుగా రాజాథియేటర్ వైపు వెళ్తున్న అశోక్ను సాంకేతిక పరిజ్ఞానంతో పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు కౌన్సిలింగ్ ఇచ్చి బంధువులకు అప్పగించినట్లు తెలిపారు. త్వరగా స్పందించిన పోలీసులకు అశోక్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ చేసే ముఠా అరెస్టు

### 21 కేజీల గంజాయి, విద్యుత్ తీగలు స్వాధీనం
### మరికొందరు పరారీ
### నిందితులను కోర్టుకు హాజరుపరిచినట్లు సీఐ వెల్లడి




**కొండపి, సెప్టెంబరు15:** జిల్లాలోని వివిధ ప్రాం తాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు పగులగొట్టి విలువైన పరికరాలు, తీగలు చోరీలు చేయడంతోపాటు, అదనపు ఆదాయం కోసం గంజాయి విక్రయిస్తున్న 13 మంది సభ్యుల ముఠాను శనివారం కొండపి పోలీసులు పట్టుకున్నారు. శనివారం రాత్రి కొండపి సీఐ సోమశేఖర్ తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కనిగిరి నుంచి ఒంగోలుకు గంజాయితో ఆటోలో నిందితు లు వెళ్తుండగా పక్కా సమాచారంతో తమ సిబ్బందితో అటకాయించి వారిని అదుపులోకి తీసుకున్నామని సీఐ వివరించారు. ఈ ముఠాలోని 13 మంది పట్టుపడగా మరికొందరు తప్పించుకున్నారన్నారు. ప్రధానంగా విశాఖపట్నం ఏరియా నుంచి గంజాయిని తెచ్చి వీరికి అందజేసిన ఇద్దరు వ్యక్తులు త ప్పించుకున్నారని సీఐ తెలిపారు. పట్టుబడిన వా రంతా జిల్లాలోని ముండ్లమూరు, తాళ్లూరు, దర్శి, పొదిలి, హెచ్ఎంపాడు, కొండపి, ఒంగోలు, ఇతర జిల్లాల్లోని వినుకొండ, నరసరావుపేట, మేదరమెట్ల ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగ లు, విద్యుత్ మోటార్లు, మోటార్ సైకిళ్లు దొంగతనాలు చేస్తూ వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్నారన్నారు. వీరంతా ఇంకా అదనంగా డబ్బులు అక్రమంగా సంపాదించాలని గంజాయి వ్యాపారం కూడా చేస్తున్నారన్నారు. వీరివద్ద 21 కేజీల గం జాయి పట్టుపడిందన్నారు. వీరు గంజాయిని 1,05,000 రూపాయలకు కొనుగోలు చేసి మార్కెట్‌లో 5 లక్షల వర కు విక్రయించే యత్నాలు చే స్తున్నారన్నారు. 20 కట్టల అ ల్యూమినియం విద్యుత్ వైరు ను స్వాధీనం చేసుకున్నామని సీఐ వివరించారు.

**నిందితులు కోర్టుకు..** తాళ్లూరు మండలం సోమవరప్పాడు ఎస్ఎసీ కాలనీకి చెందిన సోమాయనం శివ, పీసీపల్లి మండలం పెద ఇర్లపాడుకు చెందిన పోలా కిశోర్, కనిగిరిలోని పాముల పాతూరుకు చెందిన పాలపర్తి రాజు, కనిగిరి మండలంలోని తమ్ముగుంట గ్రామానికి చెందిన ఇండ్ల వెంకటనారాయణ, కనిగిరికి చెందిన నాగులూరి కమలమ్మ, మహ్మద్ ఖా సిం, బీబీజాన్, హబీబున్నీసాలతోపాటు సింగరాయకొండకు చెందిన మేడం వెంకటేశ్వర్లు, పల్నా డు జిల్లా ఈపూరుకు చెందిన చిట్టేటి శ్రీహరి, నరసరావుపేటకు చెందిన ఎస్. వెంకటేశ్వరరావు, పులి అంజిరెడ్డి, ఒంగోలుకు చెందిన ఎస్.బాబులను కో ర్టుకు అప్పగించామని సీఐ తెలిపారు. తప్పించుకు న్న మరికొందరిని పట్టుకునే ప్రయత్నంలో ఉన్నామన్నారు. కొండపి ఎస్సై కృష్ణబాజీబాబు, ఏఎస్సై అంకారావు, కానిస్టేబుళ్లు రమేష్, రవి పాల్గొన్నారు.

## పురుషోత్తమరావు ఆశయాలను కొనసాగిద్దాం : ఎమ్మెల్యే హరీష్ బాబు

### - ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు



**కాగజ్‌నగర్, సెప్టెంబరు 15:** మాజీఎమ్మెల్యే పాల్వాయి పురుషోత్తమ రావు ఆశయాలను కొనసాగిద్దామని ఎమ్మెల్యే డాక్టర్ హరీష్‌బాబు అన్నారు. ఆది వారం స్థానిక పటేల్‌గార్డెన్‌లో ఆదివారం మాజీఎమ్మెల్యే పురుషోత్తం రావు 25వ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే పాల్వాయి పురుషోత్తం రావు జ్ఞాపకార్థం ప్రజాబంధు స్వచ్ఛంద సంస్థ పేరిట మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఈ సందర్భంగా పురుషోత్తమ రావు చేసిన సేవలను గుర్తు చేశారు. వర్ధంతి సభ ఉన్నందున మెగా వైద్య క్యాంపునకు హాజరైన వైద్యులందరికీ కృతజతలు తెలిపారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పాల్గొన్నారు.

## సీఎం కావాలనే డ్రీమ్ ఎప్పుడూ లేదు

**ముంబై:** మహారాష్ట్రకు మళ్లీ ముఖ్యమంత్రి కావాలనే డ్రీమ్ తనకు లేదని, ప్రజా సేవకు తాను కట్టుబడి ఉంటానని శివసేన చీఫ్ ఉద్ధవ్ థాకరే పునరుద్ఘాటించారు. కోపర్‌గావ్‌లో అదివారంనాడు జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పీఠాన్ని తానెప్పుడూ ఆశించలేదన్నారు. ఇప్పుడు కూడా ఆశించడం లేదన్నారు. ఆ మాటకు తాను కట్టుబడి ఉంటానని చెప్పారు. ఈ ఏడాది చివర్లో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో థాకరే వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## ప్రధాన కాలువ మరమ్మతు చేయించాలి

### బీమా కాలువను పరిశీలిస్తున్న కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్



**శ్రీరంగాపురం,సెప్టెంబరు 15:** రంగ సముద్రం బ్యాలెన్స్ రిజర్వాయర్ నుంచి వెళ్లే ప్రధాన కాలువ భారీ వర్షాలకు తెగిపోయింది. కల్వరాల - పుల్గర్ చర్ల గ్రామాల మధ్య కాలువ తెగిన కాలువను ఆది వారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్ యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కాలువ ద్వారా దాదాపు 21,000 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉందని, బీమా అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతులు పంటలు ఎండబెట్టుకుంటున్నారని అన్నారు. అధికారులు తెగిపోయిన కాలువకు మరమ్మతులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. సాగునీరు లేక శ్రీరంగా పురం పుల్గర్‌చర్ల కల్వరాల, వీపనగండ్ల, అమ్మపల్లి తదితర గ్రామాల రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 16వ ప్యాకేజీ ప్రధాన కాలువకు గండ్లు పడ్డాయని, అంచనా వేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పం పామని, నిధులు మంజూరు అయిన వెంటనే కాలువ గండ్లు పూడ్చి సాగునీరు అందిస్తామని బీమా అధికారులు తెలిపారు.

# అర్ధరాత్రి పిలిచిన రెడీమేడ్ మర్చంట్ అసోసియేషన్‌కు సహకరిస్తాను









## అసోసియేషన్ కార్యాలయం మెయింటెన్స్ కు ప్రతినెల 5000 విరాళం కలిసికట్టుగా ఉంటే సమస్యలను పరిష్కరించుకోవచ్చు. -గౌరవ అధ్యక్షుడు పబ్బతి వేణుగోపాల్

**నంద్యాల సెప్టెంబర్ 15 (రిపబ్లిక్ న్యూస్):** రెడీమేడ్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు ఏ సమస్యకైనా అర్ధరాత్రి ఫోన్ చేసినా వచ్చి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని మర్చంట్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పబ్బతి వేణుగోపాల్ పేర్కొన్నారు. స్థానిక రిటైల్ మర్చంట్స్ అసోసియేషన్ నందు ఆదివారం జరిగిన కమిటీ సమావేశంలో నూతన అధ్యక్షునిగా రఘువీర్ ఫ్యాషన్స్ అధినేత గద్వాల నరసింహరాజు కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతన కమిటీ గౌరవ అధ్యక్షులుగా శ్రీ వాసవి యువసేన సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు, బిల్డర్, కాంట్రాక్టర్, పి ఏవి గ్రూప్ చైర్మన్ పబ్బతి వేణుగోపాల్ ను గౌరవ అధ్యక్షులుగా ఎన్నుకున్నారు పబ్బతి వేణుగోపాల్ సతీమణి ప్రముఖ అడ్వకేట్ గొంట్ల అపర్ణను లీగల్ అడ్వైజర్ గాఎన్నకోవడం జరిగింది. ఈ సందర్భంగా రెడీమేడ్ మర్చంట్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా ఎన్నికైన పబ్బతి వేణుగోపాల్ మాట్లాడుతూ అసోసియేషన్ ను చట్టబద్ధంగా బైలా ప్రకారం ఏర్పాటు చేసుకోవడంలో పూర్తిస్థాయిలో సహకరిస్తానని హామీ ఇచ్చారు అసోసియేషన్ నూతన భవనం నిర్మాణం పూర్తి చేసేంతవరకు కార్యాలయం మెయింటెన్స్ కొరకు ప్రతినెల 5000 రూపాయలు విరాళంగా ఇస్తానని సభ్యుల హర్షద్వానాల మధ్య ప్రకటించారు.

అసోసియేషన్ సభ్యులు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ఉంటే సమస్య వచ్చినప్పుడు పిలిచిన వెంటనే స్పందిస్తే ఏ సమస్యనైనా పరిష్కరించుకోవచ్చునని సూచించారు.

అసోసియేషన్కు చట్టపరంగా న్యాయ సలహాలు అందిస్తా- అడ్వకేట్ గోంట్ల అపర్ణ

అసోసియేషన్ కు చట్టపరంగా ఏ సమస్య వచ్చినా న్యాయ సలహా ఇచ్చి పరిష్కరించేందుకు కృషి చేస్తానని లీగల్ అడ్వైజర్ గొంట్లా అపర్ణ తెలిపారు గత కొద్ది రోజుల క్రితం దుకాణంలో 16 ఏళ్ల యువకుడు పని చేస్తుంటే బాల కార్మిక నిర్మూలన కార్యాలయం అధికారులు కేసు నమోదు చేసి 50 వేల రూపాయలను జరిమానా వేయడం జరిగింది. కానీ చట్ట ప్రకారం 14 సంవత్సరములు దాటిన తర్వాత 18 సంవత్సరాల లోపు కొన్ని ప్రత్యేక పరిస్థితులలో వారు పనిచేయవచ్చునని చట్టంలో నిబంధనలు స్పష్టంగా ఉన్నాయి. దుకాణాలలో పని చేయవచ్చు కానీ హానికరమైన ప్రదేశాలలో పనిచేయకూడదని చట్ట నిబంధనలు ఉన్నాయి. ఈ విషయాన్ని వెంటనే బాల కార్మిక నిర్మూలన కార్యాలయం అధికారుల దృష్టికి నేను తీసుకు వెళ్లడంతో 50 వేల జరిమానా కేవలం 100 రూపాయలకు కుదించి వేయడం జరిగింది రెడీమేడ్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు ఎప్పుడైనా కానీ చట్టపైన సమస్యలను ఆ దృష్టికి తీసుకుని వస్తే ఉచితంగా

పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అసోసియేషన్ లీగల్ అడ్వైజర్ గా అవకాశం కల్పించిన సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు

50% రాయితీతో వైద్య సేవలు అందిస్తా-సెవెన్ హిల్స్ హాస్పిటల్ అధినేత మారుతి

రెడీమేడ్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులకు సెవెన్ హిల్స్ కార్పొరేట్ ఆసుపత్రిలో 50% రాయితీతో వైద్యం అందిస్తానని అధినేత మారుతి హామీ ఇచ్చారు

ఉచిత యోగ శిక్షణ -ప్రముఖ యోగా గురువు ఆనంద్ గురూజీ

ఆరోగ్యం ప్రతి ఒక్కరికి ఎంతో అవసరం అని ప్రముఖ యోగ గురువు ఆనంద్ గురూజీ పేర్కొన్నారు వ్యాపారంలో ఉన్నవారికి అధికంగా ఒత్తిడి ఉంటుందని మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులకు ఉచితంగా యోగా శిక్షణ ఇస్తానని హామీ ఇచ్చారు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ప్రతిరోజు శిక్షణ తరగతులకు హాజరుకావాలని కోరారు అనంతరం రిటైల్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీ శ్రీనివాస మార్కెట్ కాంప్లెక్స్ అధ్యక్షుడు అడ్డగాల మల్లికార్జున మాట్లాడుతూ



రిటైల్ మర్చంట్స్ శ్రీ శ్రీనివాస మార్కెట్ అసోసియేషన్ ల ద్వారా అసోసియేషన్ సభ్యులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు అనంతరం మల్లికార్జున గౌరవ అధ్యక్షుడు పబ్బతి వేణుగోపాల్ ను సతీమణి లీగల్ అడ్వైజర్ గోంట్లా అపర్ణను, నూతన అధ్యక్షులు గద్వాల నరసింహారాజును శాలువా కప్పి ఘనంగా సత్కరించడం జరిగింది.

## నేటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు.

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.



**నంద్యాల, సెప్టెంబర్ 15, రిపబ్లిక్ న్యూస్ ::** ప్రతి సోమవారం కలెక్టరేట్ లోని సెంటినరీ హాలులో నిర్వహించే "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని నేడు ఈద్ మిలాడినబి పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు దినం కావడంతో రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి వ్యయ ప్రయాసలకోర్చి జిల్లా కేంద్రానికి రావద్దని ఆమె ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు

## నేడు "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం..."రద్దు

### -జిల్లా ఎస్పీ శ్రీ అధిరాజ్ సింగ్ రాణా

**నంద్యాల క్రైమ్, సెప్టెంబర్ 13, (రిపబ్లిక్ న్యూస్):** నేడు (సోమవారం) మీలాద్ ఉన్ నబీ (ప్రభుత్వ సెలవు దినం) పండుగ అయినందున" ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమంను " రద్దు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా,ఐపియస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున అర్జీదారులు సుదూర ప్రాంతాల నుండి వ్యయ , ప్రయాసలతో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జరగబోయే జిల్లా ఎస్పీ "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక " కార్యక్రమానికి రావొద్దని తెలిపారు. జిల్లా ప్రజలు ( ఫిర్యాదుదారులు) ఈ విషయాన్ని గమనించగలరని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## చెరువులో దూకి మహిళ ఆత్మహత్య



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 14 :** ఇబ్రహీంపట్నానికి చెందిన ఓ మహిళ శుక్రవారం రాత్రి పెద్ద చెరువులోదూకి ఆత్మహత్య చేసుకుంది. శనివారం మధ్యాహ్నం ఆమె మృతదేహాన్ని వెలికితీశారు. కుటుంబ కలహాలతోనే ఆమె ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇబ్రహీంపట్నం వెంకటరమణ కాలనీకి చెందిన కప్పాటి మంజుల(48) లంగర్‌హౌసలో జీహెచ్ఎంసీ ఔట్ సోర్సింగ్ స్వీపర్‌గా పనిచేసేది. రెండు నెలల క్రితమే ఆమె భర్త పున్నయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. ఈమెకు మగ్గురు కుమారులు. కుటుంబంలో గొడవల కారణంగానే ఆమె ఆత్మహత్యకు పాల్పడిందని భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

## రాజ్యాధికారాన్ని దూరం చేసేందుకే ఎస్సీ వర్గీకరణ

**జైభీమ్ భారత్ పార్టీ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్**
**మాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో**
**ఒంగోలులో భారీ ర్యాలీ, సభ**
**వర్గీకరణ, క్రీమిలేయర్‌కు వ్యతిరేకంగా తీర్మానం**

**ఒంగోలు (క్రైం), సెప్టెంబరు 14 :** దళితులకు రాజ్యాధి కారాన్ని దూరం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణను తెరపైకి తెచ్చాయని జైభీమ్ భారత్ పార్టీ అధ్యక్షుడు జడా శ్రావణ్‌కుమార్ విమర్శించారు. ఎస్సీ వర్గీ కరణను వ్యతిరేకిస్తూ 'హలో మాల.. చలో ఒంగోలు' పేరు తో సోమవారం మాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్‌భవన్‌లో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. వర్గీకరణపై వచ్చిన తీర్పును ఆయా రాష్ట్రాలు అమలు చేయకుండా నిలువరంచే విధంగా ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. జనాభాలో ఐక్యంగా ఉన్న 25 శాతం మంది మధ్య వర్గీకరణ చిచ్చు పెట్టి రాజకీయ లబ్ధి పొందాలని పాలకులు చూస్తున్నారని ధ్వజమెత్తారు. ఆ కుట్రలో మందా కృష్ణను పావుగా వాడుకుం టున్నారన్నా రు. ఈతీర్పు రాజ్యాంగ వ్యతిరేకమైన దన్నారు. మాల మ హాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు మాట్లా డుతూ వర్గీకరణ మాటున క్రిమీలేయర్ కుట్ర జరుగు తున్నదన్నారు. దీని వలన ఎస్సీ, ఎస్టీలలోని అన్ని కులా లకు ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. మంద కృష్ణ మాదిగ బానిస మనస్తత్వం కలిగిన వ్యక్తి అని విమర్శించారు. మను వాదుల కుట్రను ఎదుర్కొనేందు కు మాలలు ముందుండి పోరాడాలని పిలుపునిచ్చారు. ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ క్రీమిలేయర్ వలన మాదిగలకు రిజర్వేషన్‌లు దక్కే అవకా శం లేదన్నారు. మాల ఉద్యోగుల సంఘ నాయకుడు బి. గోపీనాథ్ అధ్యక్షతన జరిగిన సభలో మాల మహానాడు జాతీయ మహిళా అ?ధ్యక్షురాలు మంచా మల్లేశ్వరి, మాల ఉద్యోగ సంఘ నాయకులు తుల్లిబిల్లి అశోక్‌బాబు, దమ్ము థామస్, యర్రమాల మల్లికార్జునరావు, కె.బాబూరావు



పాల్గొన్నారు. సభకు ముందు మాల ఉద్యోగుల సంఘం ఆ ధ్వర్యంలో నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని దళిత నాయకులు నీలం నాగేంద్రరావు, చప్పిడి వెంగళరా వు, బిళ్లా చెన్నయ్య, దాసరి శివాజీలు జెండాలు ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ జీవన్, మాల ఉ ద్యోగుల సంఘం మాజీ నాయకులు కాకి కృపారావు, మా ల్యాద్రి తదితర పాల్గొన్నారు

## ఖిల్లాఘణపురం పీహెచ్‌సీలో వైద్య సేవలు అందిస్తున్న రెండో ఏఎన్ఎంలు

**ఖిల్లాఘణపురం, సెప్టెంబరు 15:** వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో రెండున్నర దశాబ్దాలుగా కాంట్రాక్టు ప్రాతిపదికన పని చేస్తున్న రెండో ఏఎన్ఎంల పరిస్థితి అధ్వానంగా మారింది. చాలీ చాలని వేతనాలతో జీవి తాన్ని నెట్టుకొస్తు ఉద్యోగ భద్రత కోసం ఎదురుచూస్తు న్నారు. దశల వారీగా ఉద్యోగాలను క్రమబద్ధీకరించాల్సి ఉండగా పట్టించుకునే వారు లేకపోవడంతో పని ఒత్తిడితో వెట్టిచాకిరి చేస్తున్నారు. వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలో జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రభుత్వం సం యుక్తంగా ఆరోగ్య ఉప కేంద్రాలు పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో రెండో ఏఎన్ఎంలను కాంట్రాక్టు ప్రాతిపది కన నియమించారు. 2001 నుంచి ప్రతీ ఏడాది దశల వారీగా నియామకాల ప్రక్రియ చేపట్టారు. అనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దివంగత ముఖ్య మంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో కొంతమంది ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయగా 2011లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నామమాత్రంగా 35 మంది ఏఎన్ఎంలకు ఉద్యోగ భద్రత కల్పించి రెగ్యులర్ ప్రక్రి యను నిలిపివేశారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వాలు స్పందించడం లేదు. గతేడాది అసెంబ్లీ ఎన్నికలకు

### ఉద్యోగ భద్రత కోసం ఎదురుచూపు

ముందు నెల రోజుల పాటు ఉద్యోగ భద్రత కోసం సమ్మె చేయడంతో ప్రభుత్వం సమ్మె కాలానికి జీతం సైతం చెల్లించలేదు. ఎన్నికల ముందు ప్రతిపక్ష పార్టీల నేతలు రెగ్యులర్ చేస్తామని ప్రకటనలు చేసి అధికారంలోకి వచ్చిన వెం టనే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో 74 మంది రెండో ఏఎన్ఎంలు రెగ్యులర్ ఏఎన్ఎంలతో సమానంగా విధులు నిర్వహిస్తున్నారు. ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నాలుగు గ్రామాలు ఉంటే రెండు గ్రా మాలు రెగ్యులర్ మరో రెండు గ్రామాల బాధ్యతలను కాంట్రాక్టు ఏఎన్ఎంలకు కేటాయించారు. వీరి మధ్య వేత వ్యత్యాసం మాత్రం చాలా ఉంది. నెలకు అంది స్తున్న రూ.27,300 వేతనం సరిపోవడం లేదని, ఏరి యల్స్ అమౌంట్ సైతం ఇవ్వడం లేదని రెండో ఏఎన్ ఎంలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో ఏఎన్ఎం రెండు, మూడు గ్రామాలలో వైద్య సేవలు అందించ డానికి కేటాయించారు. కానీ రెగ్యులర్ ఏఎన్ఎంలకు రవాణా కోసం ఎఫ్‌టీఏ బిల్లులు చెల్లించ్కిoట్రాక్టు ఏఎన్ఎంలకు చెల్లించడం లేదు. జిల్లాలో వ్యాక్సినేషన్ డబ్బాలు తరలించడానికి వ్యాక్సిన్ క్యారియర్ అమౌం ట్ సైతం ఇవ్వడం లేదని ఆరోపణలు ఉన్నాయి. వైద్య, ఆరోగ్య శాఖకు ఆన్‌లైన్‌లో వివరాలు పంపించడానికి, స్టేషనరీకి సైతం బిల్లులు చెల్లించడం లేదని సొంత డబ్బులను ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. పని ఒత్తిడి పెరగడంతో అనారోగ్యానికి గురై కాంట్రాక్టు ఏఎన్ఎం లు మృత్యువాత పడుతున్నారు. రెండేళ్ల క్రితం వనపర్తి జిల్లా ఆత్మకూరుకు చెందిన రెండో ఏఎన్ఎం లక్ష్మి సైతం పని ఒత్తిడిని తట్టుకోలేక మరణించినట్లు రెండో ఏఎన్ఎంలు గుర్తు చేస్తున్నారు. పక్క గ్రామాల కు వెళ్లి వైద్యసేవలు అందించడానికి సరైన రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాల కాలం పాటు ఏఎన్ఎంలుగా వైద్య సేవలు అందించిన చాలా మందికి వయసు పైబడుతుందని వెంటనే ఎలాంటి షరతులు లేకుండా ఉద్యోగ భద్రత కల్పించి రెగ్యులర్ చేస్తే ప్రయోజనం ఉంటుందని రెండో ఏఎన్ఎంలు కోరుతున్నారు.



printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com